ఆనాడు శ్రావణ మంగళవారం.

"పెళ్లైన పడుచులంతా ముత్తైదుతనాన్ని పెంపొందించుకునే రోజు" అంటూండేవాడు మామయ్య. సరో అక్కయ్య కూడా నోచుకుంటోంది మంగళగౌరీవ్రతం. తెల్లారే లేచి తలంటి పోసుకుంది. ఆరేసిన పట్టుచీర కచ్చాపోసి కట్టుకుని పీటకి పసుపు రాస్తూ కూచుంది. గుమ్మాల్నిండా పచ్చగా పసుపు. పసుపు మీద పెద్దపులి మచ్చల్లా మెత్తిన కుంకుమ, బియ్యప్పిండి చుక్కలు, గుమ్మాలకి మామిడిమండలు, అచ్చం పెళ్లివారిల్లులా వుంది మా డాబా!

"ఏరోయ్, పండుగఅనా ఇవాళ ఎనిమిదైనా లేవలేదు?" నాన్నగారు కేకేశారు దొడ్లోస్నానం చేస్తూ.


శశి (13)
సికింద్రాబాదు.

విసుక్కుంటూ లేచి పక్క చుట్టాను. చేతులో కళ్లపాడేసుకుని, వంటింటి గుమ్మంలోకెళ్లా, అమ్మేం చేస్తోందో చూద్దామని. అడ్డెడు తప్పెలతో లడాయేస్తోంది! అది చూస్తేగాని గుర్తురాలేదు, ఇవాళ అత్తయ్యవాళ్ల భోజనం మాఇంట్లోనేనని.

"ఏఁరోయి ఁకిప్పుడే తెల్లారినట్లుందే?" అంది అత్తయ్య దోసకాయలు చెక్కుతీస్తూ.

నవ్వుతూ దొడ్లోకెళ్లాను. గబగబా మిగతాపనంతా కానిచ్చి స్నానం చేశాను. తల దువ్వుకుంటూ టైంటేబుల్ చూశా. "ఊ... వెధవ చదువు" ఇవాల్టికి ఇంట్లోనే ఉండాలనిపించింది. అన్నట్టు అమ్మ నిన్ననే చెప్పిందిగా!

వెళ్లి వంటింటి గుమ్మంలో కూర్చున్నా. నాన్నా, సరూ అక్కయ్యా పొగలో అమ్మ వారితో సతమతమూతున్నారు. నాన్నగారు గౌరీసహస్రనామాలు తియ్యగా చదువుతూంటే అక్కయ్య మా దొడ్లోపూసిన




పల్లకీ: అల్లుమోలు సావిత్రి (6), గునుపూడి.

మల్లెపూలు అమ్మవారి మీద వేస్తోంది. పూజయింతరవాత వాయనం ఇవ్వటం గారెలు, బజ్జీలు పెట్టిన పళ్లెం అత్తయ్యొకచివరా, అక్కయ్యొకచివరా పట్టుకున్నారు.

"ఇస్తి వాయనం" అంది అక్క నన్నుచూచి నవ్వుతూ. అత్తయ్య, అక్కవైపు గుడ్లురిమిచూచి "పుచ్చుకుంటి వాయనం" అంది.

"నా వాయనం పుచ్చుకున్నవని తెవరు?"

"గౌరీ పార్వతి"


"కోరితి వరం"

"ఇస్తి వరం"

తంతు పూర్తయింది మహానైవేద్యమయింది. మా నివేదన కావాలిక! నాన్నా, మావయ్యా మడి కట్టుకుని పక్కగా కూర్చున్నారు. నాకు పక్కగా పీటేశారు.

"పండగనాడు ఈ దిరీసే (డ్రెస్సు)మిట్రా?" అంది అత్తయ్య నాపైజామా వైపు చూస్తూ.

వీళ్ల పోరుపడలేక బనీను తొడగటం మానేశా అన్నం తినేటప్పుడు. మొలమీద పంచ నిలవదాయె! ఏంచేసేది?



పెళ్లికూతురు :
తిప్పావఝ్ఝుల ఉమాశంకర్ (14) గుంటూరు.

అమ్మయ్య! గారె, బజ్జీ, పరవాన్నం, వీటన్నిటితో కుస్తీపట్టేసరికి, కూర్చున్నవాణ్ని లేవటానికి భగీరథప్రయత్నమైంది. (ఎన్నడూ రాయనివాడిని, ఒకరోజు కాపీ రాసేసరికి మా మేష్టరుగారు 'భగీరథప్రయత్నం' చేశావురా అన్నారు) పండగ కదా అని తమలపాకులు వేసుకొందుకు పర్మిషన్ దొరికింది. అందరికీ తెలిసి రెండాకులు, ఒక వక్క. బ్లాకు మార్కెట్టుగా నాలుగాకులు, ఒక వక్క, అక్కయ్యిచ్చింది ఎవరూ చూడకుండా.

పొట్టబరువు తగ్గగానే అక్క పేరంటాళ్లని పిలవడానికి బయలుదేరింది. వెంట, నేను తోడు, మగవాణ్ని! కొందరిళ్లల్లో, అక్కయీడువాళ్లు అప్పుడే ఇచ్చేశారు వాయనం. నానెత్తిన పడింది శనగలు మోయవలసిన భారం!

ఇంటికొచ్చింతరవాత తమలపాకులు పట్టీలు కట్టడం. పూచిక పుల్లలు నేనే చీరాను. రెండాకులు, రెండు పచ్చొక్క ముక్కలు ఒక పట్టీలో. కట్టాన్నంతసేపూ నా దవడ ఆడుతూనే వుంది! పనంతా అయేసరికి రెండైంది. అమ్మ వంటింట్లోనే పీటవాల్చి, దానిమీద తలవుంచుకుని నడుంవాల్చింది. అమ్మ నిద్రపోయిన అదనుచూచుకొని అక్కయ్య 'పత్రిక' తీసింది. నేమా బొమ్మలు చూశాను.



ఆటకత్తెలు
చిరా యశోద (15) చోడవరం.

# శ్రావణ మంగళవారం

ఇంతలో రామారావొచ్చాడు. నాలుగైంది. "బడికి రాలేదేంరా?" అన్నాడు.

"అవును" అన్నా ధీమాగా.

"ఆడుకుందుకు రావా?"

"ఊఁ......హూఁ..."

ఎక్కిరించి వెళ్లిపోయాడు వాడు. ఆడవాళ్లు మాట్లాడుకుంటూంటే వినాలని సరదా నాకు.

"శశీ" అన్నారెవరో.

తలెత్తి చూసేసరికి నటరాజన్, పక్కింటి శకుంతలమ్మగారి కొడుకు.

"ఎన్నాడా?" అన్నా.


నేను అరవం మాట్లాడటం చూసి ఇకిలించాడు 'నటరాజన్'

మొహం కడుక్కున్నా సబ్బుతో. అక్క పౌడర్ రాసి కొత్తచొక్కా లాగూ తొడిగింది.

చల్లపడింది. వాకిట్లో రైలాటాడుకుంటున్నారు పిల్లలు. దుమ్ము రేగుతోంది.

పేరంటాళ్లంతా వచ్చారు. మా తెలుగుమేష్టారి పెళ్లాం పాటపాడింది ఒకసారి. రెండుబొమ్మలు చూశారు. "అందానికి నేను, సంగీతానికి మా చెల్లాయి" అని వుంది. ఒకటి వొంటె, మరొకటి గాడిదా! గుర్తొచ్చి నవ్వుకున్నా. అక్క, అమ్మ, అత్తయ్య వచ్చిన వారందరికీ పసుపురాసి, గంధం పూసి, బొట్టుపెట్టి శనగలిచ్చారు.

పిల్చినవాళ్లంతా వెళ్లారు. పిల్లలు చేసిన అల్లరి తగ్గింది. "శకుంతలత్తయ్యగారు రాలేదురా



తల్లులూ పిల్లలూ :

చిత్రకారుడు :—కరజాడ దుర్గాప్రసాదరావు (6) స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఎండ్.క్రాఫ్ట్స్, విజయనగరం.

ఇంకా" అక్క వాకిట్లోకి చూస్తూ "వెళ్లి కేకేస్తావురా?" అంది.

ఒక్క పరుగున నటరాజన్ గారింటికెళ్లా. ఆడుకునేందుకు వెళ్లి, ఇంకా రాలేదు కాబోలు, ఇంట్లో లేడు. వంటింటి గుమ్మంలోకెళ్లి "ఎన్నాంగో మామిగారూ!" అన్నా.

ఆవిడ కుంపటిమీద చారుపెట్టి తీరుబడిగా కూర్చుంది, ఎదురుగా పీటమీద. నేను పిలవటం విని గుమ్మంవైపు తిరిగి "ఏమిరా?" అంది.

"అక్క పేరంటానికి పిల్చుకు రమ్మంది"

"నీవుపో, నే నిప్పుడే వస్తును" నాకు నవ్వొచ్చింది. నాకొచ్చిన అరవమంతకూడా రాదు, అత్తయ్యగారికి తెలుగు!

పావుగంటైంతరవాత వొచ్చింది.

"ఏమండీ ఆలస్యమయిందేం" అమ్మ అడిగింది పసుపురాస్తూ. అక్క బొట్టుపెట్టి శనగలిచ్చింది.

"రసం కాగుతూందండీ పొయ్యిమీద, చారు మరుగుతేదా మాకు బాగుండదండీ"

"చారు కాగినకొద్దీ రుచంటారు కదుటండీ మరి" అంటూ అత్తయ్య ఆవిడ దగ్గరగా జరిగింది.

"యారు సెప్పినారండీ? పొంగకముందుదా చారు దించి వేయవాల, లేకపోతే పాగకంపు వేస్తది!"

"అత్తయ్యగారికి, అప్పడానికి నెయ్యిరాసి తెచ్చియ్యవే" అంది అమ్మ, అక్కవంక చూసి.


అప్పడం తింటూ "అప్పడందా పెట్టూంటే నోరు బాగా చేస్తారను కుంటిని అడడా... ఇదియేమి అప్పడబ్బా రొంబకారమా ఇరుకుదె?" అందావిడ నడినెత్తిన కొట్టుకుంటూ (కారం నెత్తికెక్క)


అమ్మకీ అత్తయ్యకీ మనుషుల కొచ్చినంత కోపం వచ్చింది!

నాకూ వచ్చింది, లేకపోతే ఏమిటి మరీ, నిక్షేపంలాంటి అప్పడాల్ని తిడుతూంటే.

"కారంగా వున్నాయా?" అంది అమ్మ కోపమాపుకుని.

"అప్పడమంటే ఇలాగ కాదండీ





వాలు జడ

కాశీనాధుని లక్ష్మీనరసాదేవి (7)
తాడేపల్లి గూడెం.

# పుణ్యమెవరిది?

ఎమ్. వి. ఎస్. ఆర్. శర్మ (12) కాటూరు.

పాతరోజుల రాజొక్కడు
జాతికంతకు ఖ్యాతి తేగల
దేవళం కట్టించవలెనని
పూనుకున్నాడు.

రాజు దలచిన కొదవ ఏమిటి ?
మోజుమీరగ వ్యయప్రయాసలు
లెక్కచేయక చక్కగా గుడి
పూర్తిచేశాడు.

నిక్కముగ ఇటువంటి మందిర
మెక్కడుందని జనులు పొగడగ
చక్కగా తనపేరు ద్వారం
పైన కూర్చాడు.

ఉత్సవాలూ సంబరాలూ
పచ్చపచ్చగ మెచ్చుమీరగ
హెచ్చు అలసటచేత భూపతి
నిద్దరోయాడు.

నిదురలో కల ఒకటికన్నా
డెదురుగా తన మందిరం అది.
కాని ద్వారంపైన పేరొక
ఆడుదానిదిగా !

రాజు అచ్చెరువంది రెండవ
రోజు భటులను రాజ్యమంతా
వెదకి ఆవిడ ఎక్కడుందో
తెండి అన్నాడు.

భటులు కాటికి కాళ్లుజాచిన
కటిక ముదుసలి పేదరాలిని
ఒక్కతెను ఆ రాజు ముందుకు
తోడితెచ్చారు.

మందిరం కట్టటానికి నీ
వంద చేసిన సాయమేమిటి ?
ఎందుకో నీపేరు ఉందని
రాజు అడిగాడు.

మందిరానికి రాళ్లుమోస్తూ
కుంద్రమందిన ఎద్దులకు నే
మేత వేసిన మాట నిజమని
అవ్వ పలికింది.

కీర్తికోసం పాటుబడితే
ఆర్తిబాపినదామె అని ఆ
రాజు ముదుసలియామె పేరే
చెక్కమన్నాడు.

## శ్రావణ మంగళవారం

చేయడం, పిండి ఆముదముతో మెత్తగా మర్దన చెయ్యాలి. నల్లేరురసంతో పిండి నాలుగు గంటలు నలగ కొట్టాలి. అప్పుడుదాం వొత్తవాలి. అసలు కారమే వెయ్యరాదండి" అందావిడ అక్క ఇచ్చిన మంచి నీళ్లు తాగుతూ.

"అలాగా" అందత్తయ్య ఆవిడ చెప్తున్నంతసేపూ ఆపళంగా నోరు తెరుచుకుని.

"ఇంకనే పోయివస్తాను" అందావిడ గుమ్మందాటుతూ. అన్నంతిని, తాంబూలం వేసుకుని మబ్బుగా లేదుకదా అని డాబామీది కెళ్లా. బిచానా పరుచుకుని హాయిగా పడుకున్నా. చల్లగా వెన్నెలా, జలజలా రాలిపోతున్నాయేమో అన్నట్లు మినుకు మినుకుమనే నక్షత్రాలు. మగతగా నిద్ర మత్తొచ్చింది. చల్లగా మల్లెపందిరిమీది నుంచొచ్చేగాలి జోకొట్టింది. హాయిగా నిద్రపోయాను, శ్రావణ మంగళవారం పరమాన్నాన్ని గుర్తుచేసుకుంటూ. ★